DYNAMIC EDITION
# వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 2
శుక్రవారం, నవంబరు 10, 2023



## నేను చెల్లని రూపాయ్ కాదు డాలర్.. పువ్వాడకు తుమ్మల కౌంటర్




ఖమ్మం(వాయిస్ టుడే): మంత్రి పువ్వాడ అజయ్‌కు కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు కౌంటర్ ఇచ్చారు. "నేను చెల్లని రూపాయి కాదు డాలర్.....ఎక్కడైనా చెల్లుతా. డాలర్ కి ప్రపంచంలో ఏ దేశంలోనైనా విలువ. నీవు రద్దైన రెండు వేల నోటు నీ విలువ అది" అంటూ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కడైనా పోటీ చేస్తానని.. ఖమ్మంలో పువ్వాడపై గెలుపు తనదే అని ధీమా వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో భూ కబ్జాలు, అక్రమ కేసులు పెట్టించడం చేయలేదన్నారు. ప్రముఖ డాక్టర్ల భూములు కబ్జా చేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రఘునాథపాలెం మండలంలో లంబాడ సోదరుల భూములు, గుట్టలు కబ్జా చేశారని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. అరాచకం లేని ఖమ్మం కోసం, ప్రశాంతమైన ఖమ్మం కోసం, అన్ని వర్గాలు సంతోషంగా ఉండే ఖమ్మం కోసం కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.



# ఆదివాసుల ఓటు ఎటూ..?

అదిలాబాద్, నవంబర్ 10, (వాయిస్ టుడే): ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీ ఓట్లు ఏ పార్టీకి దక్కుతాయనేది ఆసక్తికరంగా మారింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏ పార్టీకి ఓట్లు వారి దక్కుతాయనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఆదివాసులు అంటే అదిలాబాద్ జిల్లాలో క్రమశిక్షణ పేరు గలవారు, గూడెం పెద్ద చెప్పిన మాట ప్రకారం నడుచుకునే వారు. ఎన్నికల్లో ఆదివాసీలు ఎంతో చైతన్యవంతంగా వ్యవహారిస్తారు. ఓటును నోట్లోకు అమ్ముకోవడానికి అంగీకరించరు. గ్రామ పెద్దలు చెప్పిన తీర్మానం ప్రకారమే ఓటేస్తారు, బాధ్యతగా ఓటేస్తారు. గూడాలలో సుమారు 90 నుంచి 95% ఓట్లు పోలయ్యేలా చూస్తారు. ఇలాంటి చైతన్యత ఓట్లు గల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు సెగ్మెంట్లు ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ లో అత్యధికంగా ఆదివాసి బిడ్డలు గల సెగ్మెంట్లు మూడు ఉన్నాయి. ఆసిఫాబాద్, బోత్, ఖానాపూర్ షెడ్యూలు తెగలకు రిజర్వ్ చేశారు. ఈ మూడు నియోజకవర్గాల్లో సుమారు ఆరున్నర లక్షల ఓట్లు ఉండగా అందులో ఆదివాసుల ఓట్లు సుమారు మూడు లక్షలు ఉంటాయి. మూడు సెగ్మెంట్లలో గెలుపోటములకు ఆదివాసుల ఓట్లే కీలకంగా ఉన్నాయి. ఆదివాసీలు మిగతా సామాజిక వర్గాలకు భిన్నంగా ఉంటారు, మాటకు కట్టుబడి ఉంటారు. ఒకసారి తీసుకున్న నిర్ణయానికి వెనుకకు పోనివ్వరు, ఇలాంటి కీలక ఓట్లు ఏ పార్టీ నేతకు పడతాయో ఆ పార్టీ నేత విజయం ఖాయమవుతుంది. ఆదివాసీలు నోటుకు ఓట్లు వేయరు, ఎలాంటి ప్రలోబాలకు అమ్ముడు పోరు, మద్యానికి బానిసగా ఉండరు, ఎవరైనా నేతలు వచ్చి గూడెంలో తమకే ఓటేయాలని ఎవరైనా ప్రలోభలకు గురి చేసే ప్రయత్నం చేస్తే తిప్పి కొడతారు, గూడెంలో పెద్దలు చెప్పిన మాటని గౌరవిస్తారు, ఎవరిష్టం వచ్చినట్టు వారు ఓటు వేయరు, అందరూ కలిసి ఏకాభిప్రాయంతో ఓటు వస్తారు. పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో జాగ్రత్తగా వ్యవహరిస్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక స్వరాష్ట్రంలో ఆదివాసీల కష్టాలు తీరుతాయని భావించిన ఆదివాసీలకు మొండి చేయి చ్చూపారని ఆదివాసీలు టిఆర్ఎస్ పార్టీ పై కోపంతో ఉన్నారు. రెండు సార్లు అధికారం




ఇచ్చినా ఆదివాసుల సమస్యలు తీరలేవని, గ్రామాల్లో రోడ్లు వంతెనలు దశాబ్దాల కాలం నుంచి పెండింగ్లో ఉన్నాయని ఆదివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యా వైద్యం అందుబాటులో లేదని, 108 అంబులెన్సులు రావడానికి మార్గాలు లేవని ఆరోపిస్తున్నారు. ఆదివాసీలను పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ఎలాంటి కృషి చేయలేదని ఆరోపిస్తున్నారు. మౌలిక సదుపాయాలు సమకూరక పోయినా ఎప్పటినుంచో హామీలో ఉన్న గిరిజన యూనివర్సిటీ జిల్లాకు రాకవడంపై అసంతృప్తికి కారణమైంది. అడవి తల్లి బిడ్డలు అంటే గెలిచిన ప్రభుత్వాలకు పట్టవని, కేవలం ఓట్లు వచ్చినప్పుడు ఐదు ఏళ్ల కు ఒకసారి వచ్చి పోతారని తర్వాత మర్చిపోతారని స్థానిక ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చినప్పటికీ ఆదివాసులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారని ఆదివాసి పెంద్రం భీమ్రావు అంటున్నారు. ఈసారి ఎన్నికల్లో పెద్దలు ఏ విధంగా నిర్ణయిస్తే వారికి ఓటేస్తామని చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఆదివాసులకు చేసిన సంక్షేమ ఫలాలు తమన గెలిపిస్తాయని బిఆర్ఎస్ పార్టీ ఆలోచిస్తుంటే, వ్యతిరేక ఓట్లు గెలిపిస్తాయని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి, మరోవైపు బీజేపీ కే ఆదివాసి ఓట్లు పడుతాయని భావిస్తున్నారు



## ముగిసిన నామినేషన్ల ప్రక్రియ..
### ఆఖరి నిమిషంలో నామినేషన్ వేసిన రేవంత్

హైదరాబాద్ (వాయిస్ టుడే): తెలంగాణలో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మధ్యాహ్నం 3 గంటలతో గడువు ముగిసింది. 3 గంటల తర్వాత లైన్‌లో ఉన్నవారికి మాత్రం నామినేషన్లు వేసే అవకాశం కల్పించింది. ఈనెల 13న అధికారులు నామినేషన్లు పరిశీలించనున్నారు. ఈనెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు విధించారు.

ఇక ఈ నెల 30న 119 నియోజకవర్గాల్లో ఒకేసారి పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 3న ఎన్నికల ఫలితాలు వెలువడ నున్నాయి. ఈసారి టీడీపీ, వైఎస్సార్‌టీపీ పోటీ నుంచి తప్పుకున్నాయి. వైఎస్సార్‌టీపీ మాత్రం అధికారికంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలిపింది. ఇక కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా సీపీఐ కొత్తగూడెం నుంచి బరిలోకి దిగింది. సీపీఎం మాత్రం ఒంటరిగా పోటీ చేస్తోంది. 119 నియోజకవర్గాల్లో రెండు వేల ఐదు వందలకు పైగా నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా గజ్వేల్, మేడ్చల్ నియోజకవర్గాల్లో నామినేషన్లు వేశారు. గజ్వేల్‌లో యాభై, మేడ్చల్‌లో ముప్పై వరకు నామినేషన్లు వేశారు. 118 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లు వేశారు. ఒక స్థానం సీపీఐకి కాంగ్రెస్ కేటాయించింది. గతంతో పోలిస్తే ఈసారి కాంగ్రెస్‌కు రెబల్ బెడద కూడా తగ్గింది. ఒకటి, రెండు స్థానాలు మినహా ఎక్కడా రెబల్స్ బెడద లేదు. నామినేషన్ల ఉపసంహరణ నాటికి కాంగ్రెస్ నుంచి సింగిల్ అభ్యర్థులు ఉండే ఛాన్సుంది. ఇక కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌పై పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, గజ్వేల్‌లో బీజేపీ నేత ఈటల రాజేందర్ పోటీ చేస్తున్నారు. కామారెడ్డిలో ఆఖరి నిమిషంలో రేవంత్‌రెడ్డి దాఖలు చేశారు. ఇక పోలింగ్‌కి మరికొన్ని రోజులే ఉండడంతో ఇక ప్రచారం ఊపందుకోనుంది.

## నారాయణ్ ఖేడ్‌లో అభ్యర్థిని మార్చిన కాంగ్రెస్.. సురేష్ షెట్కార్‌కు బదులుగా బరిలో పట్లోళ్ల



నారాయణ్‌ఖేడ్: కాంగ్రెస్ పార్టీ శుక్రవారం అసెంబ్లీ ఎన్నికల నామినేషన్‌ల గడువుకు కొన్ని గంటల ముందు నారాయణ్‌ఖేడ్‌లో అభ్యర్థిని మార్పు చేసింది. ముందుగా సురేష్‌కుమార్ షెట్కార్‌కు నారాయణ్‌ఖేడ్ అభ్యర్థిత్వాన్ని కట్టబెట్టిన కాంగ్రెస్.. ఇవాళ అతడి స్థానంలో డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. అంతకుముందు ఖేడ్ అభ్యర్థి మార్పునకు సంబంధించిన ప్రతిపాదనను తెలంగాణ పీసీసీ కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లింది. ఆ ప్రతిపాదనను పరిశీలించిన పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ ఒక ప్రకటన విడుదల చేసింది.

## కోనప్పా... ఇగ చాలప్పా...
### ఆంధ్రా వెళ్లిపో..



కొమురంభీం(వాయిస్ టుడే): ఉద్యోగ, ఉపాధ్యాయులారా... సర్కార్లను మార్చేసిన చరిత్ర మీది అని... కేసీఆర్ అరాచక పాలనకు పాతరేయండి అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సిర్పూర్ కాగజ్‌నగర్ సభలో బండి సంజయ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే వెంటనే కుప్పకూలుతాయన్నారు. తెలంగాణలో బీజేపీ తొలి గెలుపు సిర్పూర్ దే అని ధీమా వ్యక్తం చేశారు. "కోనప్పా... ఇగ చాలప్పా... ఆంధ్రా వెళ్లిపో..." అంటూ బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కన్నప్పపై బీజేపీ నేత వ్యాఖ్యలు చేశారు. అంబలి, అన్నదానం చేస్తే చేసిన పాపాలు పోతాయా? అని ప్రశ్నించారు. సిర్పూర్ మిల్లులో ఉద్యోగాలియ్యకుండా స్థానికుల పొట్టకొడతావా అంటూ మండిపడ్డారు. చేసిన తప్పులకు రాజీనామా చేసి వెళ్లిపోక మళ్లీ ఓట్లడుగుతావా అని నిలదీశారు. 50 లక్షల నిరుద్యోగుల జీవితాలను నాశనం చేసిన మూరు?డు కేసీఆర్ అని విరుచుకుపడ్డారు. ఉద్యోగాల్లేక ఇంటికి బరువైన యువతను చూసి తల్లిదండ్రులు గుండెపగిలి రోదిస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు, విద్యార్థుల, మహిళల పక్షాన యుద్ధం చేశానన్నారు. సిర్పూర్ కాగజ్ నగర్‌లో గోండు ఖిల్లాను కబ్జా చేస్తుంటే ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ఎంఐఎం నేతలు రెచ్చిపోతుంటే ఏం చేస్తున్నారని అడిగారు. "పాతబస్తీలో సభ పెట్టి దమ్ము చూపిన... సిర్పూర్‌లో మీ సత్తా చాటండి" అంటూ బండి సంజయ్ సవాల్ విసిరారు.



## పార్టీ అభ్యర్థితో నామినేషన్ వేయించేందుకు
### కారు డ్రైవర్‌గా మారిన కవిత

నిజామాబాద్ (వాయిస్ టుడే): తమ పార్టీ అభ్యర్థితో నామినేషన్ వేయించేందు ఎమ్మెల్సీ కవిత కారు డ్రైవర్‌గా మారారు. రెండవ సెట్ నామినేషన్ వేసేందుకు ఎమ్మెల్సీ కవితతో కలిసి అంబాసిడర్ కారులో ఎమ్మెల్యే గణేష్ గుప్తా ర్యాలీగా బయలు దేరారు. కవిత స్వయంగా కారును నడిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. గణేష్ గుప్తా చేసిన అభివృద్ధి, బీఆర్ఎస్ పథకాల వల్ల గెలుపు ఖాయమన్నారు. మూడవసారి ముఖ్యమంత్రి అయ్యే రికార్డ్ కేసీఆర్‌కి దక్కుతుందని కవిత జోస్యం చెప్పారు. ప్రజల ఆదరణ ప్రేమ వల్ల గెలుపు ఖాయమన్నారు. నిజామాబాద్ నగరం ఆనాడు ఎట్లా ఉండేది?.. ఈ రోజు ఎలా అయిందనే ఆలోచన చేయాలన్నారు. ఇక్కడ కల్పించిన శాంతి భద్రత వాతావరణం వల్ల అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడికి వచ్చాయన్నారు. 54 ఏళ్లు అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ ఎనాడూ నిజామాబాద్‌కు చేసిందేమీ లేదన్నారు. ఆరుసార్లు బీజేపీకి అవకాశం ఇచ్చిన నిజామాబాద్‌కు చేసింది ఏమీ లేదని.. కాబట్టి ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కవిత విజ్ఞప్తి చేశారు.

## సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరించిన నటుడు కమల్ హాసన్

విజయవాడ: సూపర్ స్టార్ కృష్ణ విగ్రహాన్ని సినీ నటుడు పద్మ భూషణ్ కమల్ హాసన్ శుక్రవారం ఆవిష్కరించారు. గురునానక్ కాలనీలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తూర్పు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జీ దేవినేని అవినాష్ తో కలిసి కమల్ హాసన్ ఆవిష్కరించారు. దేవినేని అవినాష్ మాట్లాఉతూ తెలుగు ప్రజలందరి అభిమాన నటుడు కృష్ణ విగ్రహాన్ని ఇక్కడ ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. తెలుగు ఇండస్ట్రీలో తనదైన ముద్ర వేసిన నటుడు కృష్ణ . అయన వారసత్వంతో ఇండస్ట్రీ లోకి వచ్చిన మహేష్ బాబు అటు సినీరంగంలో,ఇటు సేవ కార్యక్రమాలూ లో ముందుంటు కృష్ణ పేరు నిలబెడుతున్నారని అన్నారు.



## నా అల్లుడిని బెదిరించారు... మ్యాన్ హ్యాండ్లింగ్ ఏంటి?
### ఐటీ ఆఫీసర్స్‌పై పొంగులేటి ఫైర్



ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆఫీస్, నివాసాల్లో ఐటీ దాడులు ఇంకా కొనసాగుతున్నాయి. సోదాలు నిర్వహిస్తున్న సమయంలో ఐటీ అధికారుల ప్రవర్తన సరిగా లేదని పొంగులేటి మండిపడ్డారు. ఐటీ అధికారులు పరిధిని దాటి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ... "నాపైనా, కుటుంబ సభ్యులకు చెందిన 30 కంపెనీలపై ఐటీ దాడులు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. ఇది ప్రజా స్వామ్యమా?... ప్రజాస్వామ్యబద్ధంగా అధికారపక్షాలు పని చేస్తున్నారా?....ఆలోచన చేయాలి. అధికారిక ప్రభుత్వం ఒత్తిడితో ఐటీ దాడులు చేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉంది అని... కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్న భయంతో అధికార పార్టీలు దాడులు చేయిస్తున్నాయి. కాంగ్రెస్‌ను అధికారంలోకి రానీయకుండా ఫెవికాల్ బంధం ఉన్నా బీజేపీ, బీఆర్ఎస్ కలిసి దాడులు చేస్తున్నారు. స్వయానా నా అల్లుడిని బెదిరించారు. నా ఆఫీసు అకౌంటెంట్‌పై థర్డ్ డిగ్రీకి పాల్పడ్డారు. థర్డ్ డిగ్రీ ప్రయోగించి ఒంటి కాలు మీద నిలబెట్టారు.. దారుణంగా బెదిరించారు. ఐటీ అధికారులు పరిధిని దాటి వ్యవహరించటం దుర్మార్గం. ఐటీ అధికారులు మ్యాన్ హ్యాండ్లింగ్ చేయటం ఏమిటి?.. మీకు ఏమైనా దొరికితే కేసులు పెట్టండి. ఐటీ అధికారుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నా. మీరు హద్దులలో ఉండాలి... మీ రూల్స్ తెలియని వారు ఎవరు లేరు ఇక్కడ. నిబంధనలు ఉల్లంఘించిన మీరు కూడా దోషులు అవుతారు. బీఆర్ఎస్‌పై స్వరం పెంచిన తరువాత.. నాతో పాటు అనేక మంది వ్యక్తుల మీద అక్రమ కేసులు పెట్టారు ఓర్చుకున్నాం. మా కంపెనీలపై దాడులు చేశారు... అనుమతి ఇచ్చిన ప్రాజెక్టును ఆపివేశారు. తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు... రిటర్న్ గిఫ్ట్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా ప్రజలు ఇస్తారు. అసలు గిఫ్ట్.. కేంద్రంలో ఇవ్వబోతున్నారు" అంటూ పొంగులేటి వ్యాఖ్యలు చేశారు.

# పటాన్‌చెరులో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ.. పార్టీకి నీలం మధు గుడ్‌బై



సంగారెడ్డి (వాయిస్ టుడే): పటాన్‌చెరులో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ నాయకుడు నీలం మధు తన అనుచరులతో కలిసి బీఎస్పీలో చేరారు. నీలం మధును హస్తం పార్టీ పటాన్‌చెరు అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే బీఫామ్‌ను పెండింగ్‌లో పెట్టింది. అయితే గురువారం రాత్రి ప్రకటించిన చివరి జాబితాలో నీలం మధుకు బదులు కాటా శ్రీనివాస్‌కు టికెట్ ఇచ్చింది. దీంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి.. బీఎస్పీ టికెట్‌ను ఖరారు చేసుకున్నారు. ఆ పార్టీ తరఫున నామినేషన్ కూడా దాఖలు చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీలోకి ఎవరు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు బయటకు వెళ్తారో తెలియని పరిస్థితి ఏర్పడింది. నారాయణ్‌ఖేడ్ అభ్యర్థిని కూడా పార్టీ అధిష్ఠానం మార్చింది. గతంలో ప్రకటించిన సురేశ్ షెట్కర్ బదులు సంజీవ్ రెడ్డికి టికెట్ కేటాయించింది. ఇక సూర్యాపేటలోనూ పటేల్ రమేశ్ రెడ్డిని కాదని సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి టికెట్ ఇచ్చింది. దీంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న రమేశ్ రెడ్డి.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు.

## బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలి : మంత్రి హరీశ్ రావు



మెదక్ (వాయిస్ టుడే): బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలి. సునితామహేందర్‌రెడ్డి గెలిస్తే నర్సాపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే నామినేషన్ ర్యాలీలో మంత్రి పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. సంక్షేమ ఫలాలను అందరికి పంచేలా చూశారు. పదకొండు సార్లు కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే ఏమీ చేయలేదు. బీజేపీకి ఒకటే సీటు వచ్చిందని ఈసారి డిపాజిట్లు కూడా రావన్నారు. బీజేపీ డక్ అవుట్, కాంగ్రెస్ రన్ అవుట్ అయితే, కేసీఆర్ సెంచరీ కొడుతారన్నారు. రాష్ట్రంలో 28 లక్షల మోటర్లు ఉన్న రైతులు కేసీఆర్‌ను కాదని ఇతర పార్టీలకు ఓటు వేయరన్నారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసే అభ్యర్థి ఇప్పటి వరకు సర్పంచి కూడా కాలేదు. రాష్ట్రంలో గెలిచే పార్టీ బీఆర్ఎస్ పార్టీ, ఇతర పార్టీలు గెలిస్తే అభివృద్ధి జరగదన్నారు. సునీతా రెడ్డిని ఎమ్మెల్యే చేయండి, మదన్ రెడ్డిని ఎంపీ చేసే బాధ్యత నాది అని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## గ్రూపు తగదాలుపై కేసీఆర్ ఫైర్



నిజామాబాద్, నవంబర్ 10, (వాయిస్ టుడే): స్వయంగా తెలంగాణ సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తూంటే అక్కడి పార్టీ నేతలు కొంత మంది కాంగ్రెస్ లో చేరడం సంచలనం సృష్టించింది. ఇదంతా నేతల మధ్య గ్రూపు తగాదాల కారణంగానే చోటు చేసుకోవడంతో అక్కడి నేతలకు కేసీఆర్ క్లాస్ తీసుకున్నారు. గ్రూప్ తగాదాలు వీడాలని ఆదేశించారు. ఇగోలు పక్కన పెట్టి పార్టీ కోసం ప్రతి కార్యకర్తలతో కలిసి పని చేయాలని సూచించారు. గురువారం నామినేషన్ వేసేందుకు కామారెడ్డికి వెళ్లిన కేసీఆర్ అక్కడ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇంట్లో నియోజకవర్గ నేతలతో సమావేశం అయ్యారు. నియోజకవర్గ పార్టీ పరిస్థితిపై సమీక్షించారు. ఇటీవల కామారెడ్డి బీఆర్ఎస్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలు, వివాదాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నేతల తీరుపై గులాబీ బాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమిష్టిగా పని చేయాలని, పార్టీ గీత దాటితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. నేతలు ఇలా విభేదించుకుంటే ఎన్నికల్లో పార్టీ నుంచి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఇటువంటి పరిస్థితి తీసుకురావొద్దని సూచించారు. ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి తో పాటు ముఖ్య నేతలందరూ పాల్గొన్నారు.కామారెడ్డిలో గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేసీఆర్ కు స్థానిక నేతల మధ్య విభేదాలు ఛాలెంజింగ్ గా మారాయి. నియోజకవర్గ ముఖ్యనేతలైన తిరుమల్ రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ భర్త చంద్రశేఖర్ రెడ్డికి వాగ్వాదం జరగగా చంద్రశేఖర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో తన భార్యతో పాటు ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఈ ఘటన మరువక ముందే మాచారెడ్డి జడ్పీటీసీ, ఎంపీపీ మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో జడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డికి స్వల్ప గాయాలు అయ్యాయి. దీంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కామారెడ్డిలో పార్టీ నేతల మధ్య సమన్వయం లోపిస్తుండటం బీఆర్ఎస్ వర్గాల్లో కలకలం రేపుతోంది. దీంతో పరిస్థితి ఇలాగే కొనసాగితే డ్యామేజ్ తప్పదని భావించిన కేసీఆర్ తాజాగా స్వయంగా రంగంలోకి దిగారు. గులాబీ బాస్ గజ్వేల్‌తో పాటు కామారెడ్డిలో పోటీ చేస్తున్నారు. కామారెడ్డిలో పోటీ చేయడానికి ప్రత్యేకమైన వ్యూహం ఉందని కేసీఆర్ చెబుతున్నారు. అదేమిటన్నది ఆయన ప్రకటించడం లేదుకానీ విజాయన్ని పార్టీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఆయనను ఓడించాలన్న లక్ష్యంతో.. టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని ఆయనపై కాంగ్రెస్ పోటీకి నిలబెట్టింది.

# స్పీకర్ సెంటిమెంట్ కలిసొచ్చేనా

నిజామాబాద్, నవంబర్ 10, (వాయిస్ టుడే): నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల ప్రకటన ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. బీఆర్ఎస్ నుంచి స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వగా, బీజేపీ, కాంగ్రెస్ నుంచి అభ్యర్థుల ప్రకటనలో తీవ్ర జాప్యం జరిగింది. టికెట్ల కోసం ఆశావాహుల పోటాపోటీల అనంతరం ఎట్టకేలకు అభ్యర్థులను ప్రకటించారు. కానీ ఈ సారి బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీల నుంచి స్థానికులకు కాకుండా స్థానికేతరులను అభ్యర్థులుగా బరిలో దింపడం గమనార్హం. బీజేపీ నుంచి నిజామాబాద్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణను ఆ పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. ఇక కాంగ్రెస్ తర్జనభర్జనల అనంతరం బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించింది. ఇప్పుడు ఇదే అంశం అధికార పార్టీగా కలిసిరానుందని నియోజకవర్గంలో టాక్ వినిపిస్తోంది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన వారు ఆ తరువాత ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. సరిగ్గా ఇదే సెంటిమెంట్‌ను నమ్ముకుని విపక్షాలు ఎన్నికల బరిలోకి దిగాయి. అయితే నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులే మళ్లీ తమకు పట్టం కట్టిస్తాయని పోచారం శ్రీనివాసరెడ్డి నమ్మకంగా ఉన్నారు. పైగా దశాబ్దాల సెంటిమెంట్ ఈ ఎన్నికతో తుడిచిపెట్టుకపోతుందని ధీమాగా ఉన్నారు.స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఈసారి ఎన్నికల్లో అభివృద్ధి జపంతో ముందుకు వెళ్తున్నారు. సీఎం నియోజకవర్గం గజ్వేల్ కంటే ఎక్కువ డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఒక్క బాన్సువాడలో నిర్మించడం ఈ ఎన్నికల్లో కలిసి వస్తుందని భావిస్తున్నారు. బాన్సువాడలో మొత్తం 11 వేల డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి పేదలకు పంచారు. అలాగే రూ.200 కోట్లతో సిద్దాపూర్ రిజర్వాయర్ పనులు జరుగుతున్నాయి. కేటీఆర్ ఈ రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. పైగా 2100 మంది గిరిజనులకు పోడు పట్టాలు అందజేశారు. ఇక పోచారం వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన రైతుబంధు, బీమా ఇవన్నీ పథకాలు ఈసారి కలిసి వస్తాయన్న ధీమాతో ఉన్నారు. పైగా బాన్సువాడ నియోజకవర్గంలో 41 వేల మందికి ఆసరా పింఛన్లు అందజేస్తున్నారు. వీరంతా బీఆర్ఎస్‌కు అండగా ఉంటారని పోచారం నమ్మకంగా ఉన్నారు. దశాబ్దాల కాలంగా ఉన్న స్పీకర్ ఓటమి సెంటిమెంట్‌ను తన విజయంతో తుడిచిపెట్టాలని దృఢనిశ్చయంతో ఉన్నారు. ఆయనకు తోడుగా ఆయన కుమారుడు, డీసీసీబీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, మరో కుమారుడు సురేందర్‌రెడ్డి ఉదయం నుంచి రాత్రి వరకు ప్రజల్లో ఉంటూ జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. చివరి జాబితాలో బాన్సువాడ అభ్యర్థిగా ఏనుగు రవీందర్‌రెడ్డిని ఖరారు చేసింది. ఈ స్థానం కోసం గత ఎన్నికల్లో పోటీ చేసిన కాసుల బాల్‌రాజుతో పాటు రుద్రూరు సర్పంచ్‌గా ఉన్న ఇందూరి చంద్రశేఖర్ అలాగే బీజేపీ ఉండి కాంగ్రెస్ బాన్సువాడ టికెట్టు కోసం చివరి నిమిషం వరకు ప్రయత్నించిన మల్యాద్రిరెడ్డి కూడా ఉన్నారు. కానీ అధిష్టానం ఏనుగు వైపు మొగ్గు చూపింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి జాజుల సురేందర్ చేతిలో ఎల్లారెడ్డిలో ఏనుగు రవీందర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. ఎల్లారెడ్డి నుంచి అభ్యర్థిని తీసుకొచ్చి బాన్సువాడలో ప్రకటించడంపై కాంగ్రెస్ శ్రేణులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఇందూరి చంద్రశేఖర్‌ను అభ్యర్థిగా ప్రకటించాలని స్థానిక నాయకులు కోరారు. పైగా బాన్సువాడ నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యలో ఉన్న సెటిలర్లు కూడా చంద్రశేఖర్‌కు మద్దతు ప్రకటించారు. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారిలో చంద్రశేఖర్ ముందున్నారు. కానీ ఆయనను కాదని రవీందర్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించారు.బీజేపీ నుంచి మల్యాద్రి రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించాలనుకున్నప్పటికీ.. ఆయన కాంగ్రెస్ టికెట్టు కోసం దిల్లీ నేతలతో మంతనాలు జరుపుతుండటంతో ఆ స్థానంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణను ప్రకటించారు. అయితే స్పీకర్లుగా బాధ్యతలు నిర్వర్తించిన వారు తరువాత ఎన్నికల్లో



ఓటమిపాలైన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సెంటిమెంట్‌తోనే తనకు విజయం వరిస్తుందని ఆయన భావిస్తున్నారు. ఇక తన సామాజిక వర్గం కూడా తనకు కలిసి వస్తుందని నమ్మకంతో ఉన్నారు.



## గంగుల కమలాకర్ సంచలన వ్యాఖ్యలు

కరీంనగర్ (వాయిస్ టుడే): తెలంగాణను ఇతరుల చేతుల్లో పెట్టవద్దని, పొరపాటున వేరేవారికి అధికారం ఇస్తే రాష్ట్రం ఆగమాగమవుతుందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సంపద మీద ఆంధ్రా నేతల కన్ను పడిందని, కేసీఆర్ మళ్లీ రాకపోతే సంపదంతా వారు తీసుకువెళతారని ఆందోళన వ్యక్తం చేశారు. వెలుగులు విరజిమ్ముతున్న తెలంగాణను మళ్లీ గుడ్డి దీపంగా మార్చవద్దన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి.. కేసీఆర్‌కు పట్టం కట్టాలని గంగుల కమలాకర్ కోరారు.

తెలంగాణ రాకముందు రాష్ట్రంలో కరెంట్, నీళ్లు లేవని, ఫించన్ వచ్చేదికాదని గంగుల కమలాకర్ విమర్శించారు. ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని.. అందుకనే తెలంగాణ రావాలని కొట్లాడమని.. రాష్ట్రం వచ్చాక మన కరెంట్, నీళ్లు, నిధులు వస్తున్నాయని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ , పార్టీలు మాట్లాడుకుని హైదరాబాద్‌ను ఆంధ్రాలో కలిపే ప్రయత్నం చేస్తున్నారని.. తెలంగాణ ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. అసలు కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా? అని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వస్తే మళ్లీ ఆంధ్రా పెత్తనం వస్తాదని.. తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకుందామని అన్నారు. తెలంగాణలో మన పిల్లల భవిష్యత్ బాగుండాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా ఉండాలని గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు.

## స్వతంత్రంగా జలగం పోటీ



ఖమ్మం, నవంబర్ 10, (వాయిస్ టుడే): ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న జలగం వెంకటరావుకు ఏ పార్టీలో టిక్కెట్ దొరకకపోవడంతో స్వతంత్రంగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన బీఆర్టస్ పార్టీలో ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు చిన్న కుమారుడే ఈ జలగం వెంకటరావు. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపు నుంచి ఖమ్మంలో గెలిచిన ఏకైక అభ్యర్థి ఆయనే. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు చేతిలో పరాజయం పాలయ్యారు. అయితే తర్వాత ఆయన బీఆర్ఎస్ లో చేరారు. దీంతో జలగం వెంకట్రావుకు బీఆర్ఎస్‌లో నిరాదరణ ఎదరుయింది. వనమా వెంకటేశ్వరరావు తప్పుడు అఫిడవిట్ సమర్పించారని ఆయన గెలుపును సవాల్ చేస్తూ.. హైకోర్టులో పిటిషన్ వేశారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ క్రమంలో అత్యంత సమీప అభ్యర్థి జలగం వెంకటరావును కొత్తగూడెం ఎమ్మెల్యేగా ప్రకటించి సంచలన తీర్పు ఇచ్చింది.. అయితే, వనమా విజయంపై జలగం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. వనమా తప్పుడు అఫిడవిట్ సమర్పించి ఆస్తులను సక్రమంగా ప్రకటించలేదన్న ఆరోపణలున్నాయి. ఇవి నిజమని గుర్తించిన కోర్టు అతడిపై వేటు వేస్తున్నట్లు ప్రకటించింది. అంతేకాదు తప్పుడు అఫిడవిట్ సమర్పించినందుకు రూ. 5 లక్షల జరిమానా కూడా విధించింది. అయితే వనమా సుప్రీంకోర్టుకు వెళ్లి హై కోర్టు నిర్ణయంపై స్టే తెచ్చుకున్నారు. 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన వనమా వెంకటేశ్వరరావు ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ అభ్యర్థి జలగం వెంకటరావుపై 4,120 ఓట్ల తేడాతో గెలుపొందారు వెంకటరావు 2004లో తొలిసారిగా ఖమ్మం సత్తుపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి విజయం సాధించారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున పోటీ చేసి కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పట్లో టీఆర్ఎస్ తరఫున ఖమ్మం నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే ఆయనే. కానీ, ఆ తర్వాత రాజకీయ పరిస్థితులు మారడంతో.. ఆయన బీఆర్ఎస్ నుంచి టికెట్ దక్కలేదు. ఇటీవల ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరుతారన్న ప్రచారం జరిగింది. ఆయనకు కొత్తగూడెం టిక్కెట్ ఇచ్చేందుకు కాంగ్రెస్ కూడా ఆసక్తి చూపించింది. కానీ కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకోవాలని అనుకున్నందున జలగంను కాంగ్రెస్ పార్టీ చేర్చుకోలేదు. చివరికి ఆ సీటును సీపీఐకి కాంగ్రెస్ కేటాయించింది. ఇప్పుడు జలగం వెంకట్రావు ఇండిపెండెంట్ గా పోటీ చేస్తే ఎవరికి నష్టం జరుగుతుందన్నదానిపై కొత్త గూడెం రాజకీయాల్లో ఆసక్తి ఏర్పడింది. ం

## ఇంటి నుంచే ఓటేసే అవకాశం ఉన్నా స్పందన కరువు..




అల్వాల్: ఎన్నికల్లో వృద్ధులకు దివ్యాంగులకు లైన్‌లో ఉండి ఓటు నమోదు చేసుకోవాలంటే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ ఎన్నికల కమిషన్ ఇంటి వద్ద నుంచే ఓటు నమోదు చేసుకునే విధంగా సువర్ణ అవకాశాన్ని కల్పించింది. మంచాన పడ్డ వారు, కదులలేని, బయటకు రాలేని పరిస్థితులున్నా... అలాంటి వారితోనూ ఓటు వేయించడం ద్వారా ఓటింగ్ శాతం పెంచే సరికొత్త ఆధికారులు ఈసారి రూపొందించారు. సంబంధిత వ్యక్తుల నుంచి అంతగా స్పందన లేకపోవడం గమనార్హం. అధిక శాతం పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయడానికి ఇష్టపడుతుండగా, సుముఖంగా ఉన్న కొద్దిమంది నుంచి అవసరమైన ధృవీకరణ పత్రాలు వస్తున్నాయి. చాలా మంది వృద్ధులు, దివ్యాంగులు సైతం పోలింగ్ కేంద్రాల వద్దకే వచ్చేందుకు ఇష్టపడుతున్నట్లు తెలస్తుంది.

### 13 వేల పైచిలుకు గుర్తింపు...

80 ఏళ్లు నిండిన వృద్ధులు, నడువలేని దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల కమిషన్ ఇచ్చింది. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఈలాంటి వారు మొత్తం 13,076 మందిని అధికారులు గుర్తించారు. వారిలో 80 ఏళ్లు నిండిన వృద్ధులు 10031 మంది, దివ్యాంగులు 3045 మంది ఉన్నారు. వారికి 12–డీ ఫామ్‌లను ఇప్పటికే పంపిణీ చేసి వారి అభిప్రాయాలను సేకరించారు. దీన్ని ఆర్వో ఎన్.రవికిరణ్, నోడల్ అధికారి సుధ లింగాలలు పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 13,076 లో కొంత మంది మరణించగా, వీరిలో వృద్ధులు 103 మంది, దివ్యాంగులలో 15 మంది మాత్రమే సుముఖతను వ్యక్తం చేస్తూ లేటర్‌లను ఇచ్చారు.

### ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు

బ్యాలెట్ పత్రాలు ముద్రించాక కలెక్టర్ ఆదేశాల ప్రకారం. పోలింగ్‌కు ముందే దీని కోసం ప్రత్యేకంగా నియమించే పోస్టల్ బ్యాలెట్ బృందం బ్యాలెట్ బాక్స్‌తో పోలీసులు, అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లతో సహా ఆయా ఇళ్లకు వెళ్లి వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తారు. ఈ ప్రక్రియనంతా వారి ఇంటి వద్దకు అధికారులు వెళ్లినప్పటినుంచి రహస్యంగా సదరు వ్యక్తులు ఓటు హక్కు వినియోగించుకునే వరకు వీడియో రికార్డ్ చేస్తారు.